# గడ్డి పిల్లలు

విశాఖపట్నం, రోజు రోజుకూ పిసరంత ఎదిగే చంద్రుడికి బ్రహ్మాండమైన పోటీగా ఆ నగరం సెకను సెకనుకూ వెయ్యేసి పూర్ణ చంద్రులుగా ఎదిగిపోతోంది.

ఈ మూల ఇవాళ ఖాళీస్థలం వారం రోజుల్లో అక్కడ అన్నీ భవనాలే! బంతినారు విరజల్లేసి పెంచేసినట్లు అన్నీ ముద్దబంతి పూబంతులే!

రోడ్లు వెడల్పయి పోతున్నాయి. ఫుట్‌పాత్‌లు ఏర్పడుతున్నా, బీచ్ డబల్ డబల్‌గా బలిసిపోతోంది. పెంటకుప్పలు, పందులు, జుగుప్స తప్ప మరి ఏమీ లేని ఎల్లమ్మతోట, ఇవాళ జగదాంబ సెంటర్‌గా కన్ను చెదరగొట్టేస్తోంది.

కాస్త అటూ ఇటూ చూస్తే మనిషి మీంచి కారోబస్సో, ఆటోరిక్షాయో స్కూటరో దొర్లి పారిపోతుంది. ఆనక కె.జి.హెచ్ వారు ఎన్నో ఇబ్బందుల పాలౌతారు.

పిచికారితో నీళ్లు కొట్టినట్లు ఈ గడ్డమీద జనాన్ని ఎవరో రివ్వు రివ్వున ఇస్రి కొట్టినట్లు జనం.. జనం...

ఆంగ్లేయులు, రష్యన్లు, నానాజాతి వాళ్ళు, భారతావనిలోని అన్ని భాషల వాళ్ళు దర్శనమిస్తూ ఉంటారు. రోజా థియేటర్సు వారు అయిదేసి ఆటలు ఆడి పగలును చీకటిచేస్తూ చీకటిని పగలును చేస్తూ డబ్బు గుంజేస్తున్నారు.

ఈ ఊళ్ళో ఎక్కడ చూసినా, ఏ మూల చూసినా గుంజుడు అధికమైపోయింది. గిద్దెడుపాలు తక్కువ ఇచ్చిందని, యెంత గుంజినా సుక్క ధార్చింది కాదని గేదెను తెగ బాదే పెంటయ్య దానికింత మేత పెట్టాలనే ఊహించడు. అతని ఇల్లాలు అప్పలమ్మా అంతే... పాలు పిండుకోవడం, గేదెను రోడ్డు మీదికి తోలెయ్యడం... మన ప్రభుత్వంలాగే... డబ్బు గుంజి ఇన్ని డిగ్రీలిచ్చి కుర్రాళ్ళను వీధిలోకి తోలేస్తున్నట్లే!

గడ్డిపరకల్ని మొలిపించలేని తార్రోడ్లు నల్లని ఎడారి మొగాలేసుకొని వాళ్ళూ వీళ్ళు ఉమ్మే ఉమ్ములతో, బస్సుల మీంచి జనం కక్కే కక్కులతో, కన్నీళ్ళెట్టుకుంటున్నట్లు,

ముక్కంట, కళ్ళంట కిళ్లీ నెత్తురు కక్కుకుంటున్నట్లు సినిమా మేకప్‌తో గ్లిజరిన్ ఏడ్పులు ఏడుస్తున్నాయి.

పాపం గేదెలు!

ఏమిచేస్తాయి?

'పెపంచం మారిపోనాది. చిట్లంగట్టి పోనాది. య్యింక గడ్డేటి మొలుత్తాది. పాపం ఈ మడ్సులు కాయితం ముక్కలూ య్యోంగిలాకులూ పోస్లే అని యిస్రేత్తున్నారు. ఒక్క పంటి కేన రావు! కాని కడుపు సుట్టలు సుట్టక పోతంది. దయగల సాములు ఈ సామ్ములకింత సామ్మి కర్సయిపోనాదని ఇదయిపోకండ కాగితాల కూడేనా పారేత్తున్నారు. సాల్దేటి? పేనమున్నంతకాలం ఈ యీదులాట తప్పదు...' అనుకుంటాయో ఏమో వీధులంట అలా తిరుగుతూ ఎగిరిపడే కాగితం ముక్కల కోసం దిక్కులు చూసుకుంటూ దిగాలుగా తిరుగుతుంటాయి.

ఓ పోస్టు జవాను సైకిలు వెనుక ఉత్తరాల కట్టలు కట్టి, కొన్ని చేత్తో పుచ్చుకొని స్టేండ్ వేసి ఒక్క సెకనులో పక్కనే ఉన్న కొట్లో ఉత్తరాలివ్వడానికి వెళ్ళాడు. ఇంతలో ఏ మూల నుంచి వచ్చిందో జయ్‌న ఇన్ని ఉత్తరాలు లాగేసి గబగబ నోట్లో కుక్కేసుకుంది ఓగేదె! ఒయాసిస్ వొడ్డున మొలచిన మొక్కల్ని ఆత్రంగా మింగి గుటకలేసింది. దుబ్బున కిందపడ్డ సైకిలు ధ్వని పోస్టుమాన్‌కు వినిపించి, చచ్చాను బాబోయ్ అంటూ వీధిలోకి పరిగెత్తుకొచ్చాడు. ఇంకేముంది వో అరడజను రిజిస్టర్ ఉత్తరాలు, ఓ కవిగారి ఆకలి కావ్యం కడుపు మంటకు ఆహుతి అయ్యాయి. కవిగారి పుణ్యమా అని ఆ పుస్తకం గేదెకు గుప్పెడు ఆకలి తీర్చింది.

గేదెను ఏమిచెయ్యాలో పోస్టుమాన్‌కు తోచలేదు. ఏమి చెయ్యడానికీ చేతిలో ఏమీ లేదు. ఉత్తచేతులతో తనెక్కడ కొట్టగలడు? ఇంతలో పక్కసందులో రొచ్చుగుంటలంట దడదడ గేదె దాటిపోయింది.

ఇది దొంగబతుకని గేదెకు ఏమితెలుసు? దానికి తిండికావాలి. అది దొరికింది. దొరికిన దానిని అందుకోక తప్పదుకదా!

ఈ భూమిని ఇంతగా ఎడారిగా మార్చేస్తున్న మనుషులంతా గేదెకివ్వవలసిన వాటా మాట ఏమిటి? మనందరికీ పళ్ళూ ఫలాలు ఇస్తున్న ఈ భూమి దానికి గడ్డినికూడ యిస్తోంది. కాని మనం పళ్ళూ ఫలాలు మింగేస్తున్నాం. పైపెచ్చు మనకక్కర్లేని గడ్డిని కూడా గేదెకు దక్కనివ్వడం లేదు.

పాపం పోస్టుమాన్ ఏడుస్తూ వెళ్ళిపోయాడు. అతని ఏడ్పు చూసి ఇంచుకంత

జాలివేసినా అదేమిటో అతనిమీద అంతగా దయకలగలేదు. ఆ ఉత్తరాలలో ఓ కంపెనీ తాలూకు లక్ష రూపాయల చెక్కొకటి స్వాహా అయిపోయింది. పోస్టల్ సూపరింటెండెంట్ ఆ కంపెనీవారికి క్షమాపణలు చెప్పుకున్నాడు. ఆ కంపెనీకి ఆ చెక్కు మళ్లీ తిరిగివచ్చేటప్పటికి మూడు నెలలు పట్టింది. కంపెనీ వారు రూ.4,500లు వడ్డీ అయిందని ఆ సొమ్ము పోస్టల్ డిపార్టుమెంటు నుంచి చల్లగా రాబట్టారు. సర్కారువారు ఈ అన్యాయానికి మునిసిపాలిటీ వారిమీద ధ్వజం ఎత్తారు. రోడ్లమీద గేదెలు తిరగకుండా చేయవలసిందని జాబులు రాశారు.

వందల మీద ఉన్న పోస్టు జవాన్లందరికీ ' గేదెలున్నాయ్ జాగ్రత్త ' అని హెచ్చరికలు చేశారు. అందరికీ తగు శ్రద్ధ తీసుకోవాలని సర్క్యులర్‌లు అందజేసి మరికొంత డబ్బు తగలేశారు.

ఇదంతా తెలిసిన ఓ బట్టల కంపెనీవాడు ఉత్త కాగితాలతో బట్టలు తయారు చేయడానికి మెషీన్లు తెప్పించాలనే కుతూహలాన్ని మనసులోనే అణిచేసుకున్నాడు.

కాగితాల ఉడుపులు ధరించిన ప్రజల వెనక అడ్డమైన గెదెపడ్డలూ, మహిష రాజములూ, దున్నపోతులూ అన్నీ దాడిచేసి వాళ్ళ బట్టల్ని లాగేసి తుర తుర మెక్కేసి వాళ్ళందర్నీ నగ్నంగా ఇళ్ళకు పంపిస్తాయన్న గొప్ప ఊహలు పుట్టుకొచ్చి ఎంత తప్పు చేయబోయాను అనుకున్నాడు. ఈ కాగితం దుస్తుల కలవాటు పడిపోయిన మనుషులు వాటిని గేదెలు తినడంచూసే ఆడువారిని చూస్తూంటే నగ్నంగా ఉండడమే అందంగా ఉంటుందన్న అపోహలో పడిపోయి, అందుకు అలవాటు పడిపోతారేమో అన్న భ్రమలో కూడా కొట్టుకపోయి, అప్పటికే యాభై లక్షలు ఖర్చు చేసిన తన మిత్రునికి ఈ సంగతి చెప్పి అతని చేతకూడా ఆ మిల్లు కట్టే ప్రయత్నాన్ని విరమింపచేశాడు.

మరో గాంధీ అవతరించి ఈ జాతికి గోచీ చాలని ప్రచారం చేస్తాడేమో అని దేశంలోని బట్టల మిల్లుల యజమానులంతా హడలిపోయారు. ఈ ప్రజలు బట్టలు త్యజిస్తే వారికెప్పుడూ కూటికి కరువుండదు. కూడుండాలంటే గుడ్డలుండకూడదు వంటి స్లోగను ఏ రాజకీయ నాయకుడూ తయారు చేయకుండా ఇలా జాగ్రత్త పడాలని ఆలోచనలో మునిగిపోయారు.

ఇలా ఇంత హడలెత్తించిన వీర మహిషి ముద్దుల గేదె రాణీని గిద్దెడు పాలు తక్కువ ఇచ్చిందని ఖైదీల కళ్ళు పీకేసిన పోలీసుల్లా పెంటయ్య అప్పలమ్మలు దాని వొళ్ళంతా తూట్లు పొడిచేశారు. పాపం దానికిన్ని గెంజి నీళ్ళు కూడా ఏ రోజునా వారు పోసిన పాపాన పోలేదు. కడుగు నీళ్లు కూడా తరవాణి కాచుకొని వాళ్ళే తాగేస్తున్నారు. అది ఇచ్చిన పాలల్లో అన్నిటికి అన్ని నీళ్ళు కలిపి బతుకు వెళ్ళమారుస్తున్నారు.

అంచాత ఆ గేదె వాళ్లకు సర్వస్వం. కాని వారు దాన్ని ఏనాడు సుఖంగా బతకనిచ్చారు? రాజకీయ నాయకులకు ప్రజలే ఆధారం. కాని వాళ్ళు ఆ మూగ ప్రజల్ని ఎప్పుడూ సుఖంగా బతకనివ్వరు కదా! ఆ గేదె తిరగబడదు. మరి ఈ మనుషులూ అంతే...!

రోజు రోజుకూ భూములూ, పొలాలూ, రోడ్ల క్రింద, బిల్డింగుల కింద మారిపోతున్నాయి.

ఎక్కడ గాజువాక ఎక్కడ విశాఖపట్నం? అటు బాలచెఱువు (స్టీల్‌ప్లాంట్ ఏరియా) ఇటు నాతయ్యపాలెం (బిహెచ్‌పివి) మింధి, తుగ్లాం, చినగంట్యాడ ఎక్కడ చూసినా ఇళ్ళే, రోడ్లే, ఫ్యాక్టరీలే... మేత కింత పచ్చని స్థలం కనబడటంలేదు. గేదెల గోడు వినేవాడు లేడు.

మొన్నకు మొన్న ఓ ఇంజనీరు తనడైరీ, చేతిలోని బ్లూప్రింట్లూ కిందపెట్టి స్థలాన్ని కొలవబోతుండగా ఆ డైరీ, బ్లూప్రింట్స్ ఓ గేదె తినేసింది. వాళ్ళ కడుపు మంట కొద్దీ గేదెను పట్టుకుని బాదేశారు. దాని కడుపు మంటతీరినా వంటి మీద సలుపులు, కారుతున్న రక్తపు చారలు! ఏమిటీ బతుకు ఎందుకీ బతుకు అనిపించడం లేదు. అందుకే అది పశువు. మనం మాత్రం, కొట్టకూడదన్న ఇంగిత జ్ఞానంకూడ లేని పశువులం!

ఓ రోజున ఓ గేదె రైలు కిందపడి చనిపోయింది. ఆత్మహత్య చేసుకోవాలని కాదు. రైలు పట్టాల మధ్య రాళ్ళల్లో మొలిచిన చిన్ని చిన్ని గడ్డిపరకల్ని అమృతంలా తలచి పళ్ళకందని ఆ అమృతాన్ని నాకబోయేసరికి పులిలా వచ్చి రైలు దాన్ని నరకానికి తీసుకుని పోయింది.

పెంటయ్య అప్పలమ్మలు తమ గేదెను ఆ రోజు నుంచి ఎక్కడా తిరగనివ్వడం లేదు. రైలు గట్టునమేసి చస్తుందని కాదు. అది సూడితో ఉంది. మళ్ళీ వాళ్ళ బతుకుల్లో వసంతాన్ని తేబోతోంది. పడ్డనే పెడుతుందో, దూడనే వేస్తుందో...

ఆ రోజు రానేవచ్చింది. అప్పలమ్మ 'మా గేదె పడ్డనే వేసేట్టు సూడు తల్లీ, అని పైడితల్లి అమ్మకు మొక్కింది. కనకమహాలక్ష్మి అమ్మవారికి మొక్కింది. ఎక్కడలేని దేవుళ్ళకూ మొక్కింది.

ఆ రాత్రి హోరున వాన. వాళ్ళున్న సందువీధే వాళ్ళకు గొడ్లసాల. పెంటయ్య గేదె దగ్గరే వానలో తడుస్తూ కూర్చున్నాడు. చిరిగిపోయిన చింకి గొడుగు వాన ఊపులకు గాలి విసుర్లకు ఆగడం లేదు. మెరుపులే వెలుతురుగా అతనికళ్ళు వాన చూపులు చూస్తున్నాయ్. అరికేన్ లాంతరు టుప్ టుప్‌న కొట్టుకుని ఎప్పుడో ఆరిపోయింది.

'రాయే నంజా... ఈనేసింది...' అంటూ ఓ అరుపు అరచి పెళ్ళాన్ని పిలిచాడు పెంటయ్యి.

'పడ్డనేసిందా... దూడనెట్టిందా...' గాలి రొదలో మాటలు సరిగా వినపడటం లేదు.

'దేన్నెడితే వోడిక్కావాలే...పుట్టగానే సచ్చింది.'

'అదేట్రా'

'నోరుముయ్యే . అది బతికుంటే లీటరు పాలూ బుట్టెడు మేతా వోడెట్టి సావగలడే'

'అలాగని నిండు పేనం తీసేసినావా... రాచ్చసి ముండాకొడుకా... 'అప్పలమ్మలోని తల్లి ఆవేదన బావురుమంది.

'నోరుముయ్యే. తెల్లారేతలికి చేటపెయ్య దాని ముందుంటదిలేయే. మనకు పాలూ దక్కుతాయి, మేతా కల్సొత్తాది' అన్నాడు.

అప్పలమ్మ మరి మాటాడలేదు.

నోరడిపోయినట్లు ఉండిపోయింది.

ఒక్కసారి లోకంలో పుట్టిన పసిపిల్లలనందరినీ తండ్రులూ, తల్లులూ కల్సి కాలితో కసాబిసా తొక్కి చంపేసినట్లు లోకం అంతా క్షణంలో చల్లబడిపోయింది.

మరునాటి నుంచీ ఎవరింట్లో చూసినా గడ్డిపిల్లలే. ప్రభుత్వానికి ఎన్నో రకాల బాధలు తప్పిపోయాయి. ఎటు చూసినా ఎక్కడ చూసినా గడ్డిపిల్లలు! గడ్డి పిల్లలు!!

కష్టాలను తుడిచేసి గట్టెక్కించిన గడ్డిపిల్లలు!

(ఆదివారం వీక్లీ 23-8-1981)